భారత్ 'ఎ'జట్టుకు త్రిష

సత్తాచాటుతున్న తెలంగాణ క్రికెటర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిష సత్తాచాటుతున్నది. నిలకడైన ప్రదర్శనతో సెలెక్టర్ల నమ్మకాన్ని చూరగొంటున్నది. అండర్-19 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యురాలైన త్రిష..తాజాగా భారత 'ఎ' జట్టుకు ఎంపికైంది. ముంబై వేదికగా ఈ నెల 29 నుంచి ఇంగ్లండ్ 'ఎ' జట్టుతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత 'ఎ' జట్టులో త్రిష చోటు దక్కించుకుంది. ఇప్పటికే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ క్రికెటర్ టాపార్డర్‌లో బ్యాటింగ్‌కు తోడు ఉపయుక్తమైన బౌలర్‌గా కొనసాగుతున్నది. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ పరుగులు సాధించడంలోనే కాదు..లెగ్‌స్పిన్ బౌలింగ్‌తో అవసరమైన సమయంలో వికెట్లు తీయడంలోనూ త్రిష ప్రతిభ కనబరస్తున్నది. భారత 'ఎ' జట్టుకు కేరళకు చెందిన మిన్ను మణి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. వయనాడ్‌కు చెందిన మిన్ను..ఆసియాగేమ్స్‌లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యురాలు. వాంఖడే స్టేడియం వేదికగా ఈ నెల 29, డిసెంబర్ 1, 3 తేదీల్లో ఇంగ్లండ్ 'ఎ'తో భారత్ తలపడుతుంది.

సుకన్యకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరిగిన 28వ జాతీయ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన తేజావత్ సుకన్య కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన టోర్నీలో మహిళల 76కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య 100కిలోల బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది. వైశాలీ (107కి), శ్వేత (105కి) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న సుకన్య ప్రస్తుతం వీఎన్ రాజశేఖర్ వద్ద శిక్షణ తీసుకుంటున్నది.

వచ్చే నెల 9న డబ్ల్యూపీఎల్ వేలం

ఢిల్లీ: వచ్చే నెల 9న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలం జరగనుంది. వచ్చే ఏడాది జరుగనున్న డబ్ల్యూపీఎల్ కోసం ముంబై వేదికగా వేలం నిర్వహించనున్నట్లు శుక్రవారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జరిగిన తొలి సీజన్‌కు విశేష స్పందన లభించగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి మధ్య డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ నిర్వహించేందుకు బోర్డు కసరత్తులు చేస్తున్నది. ఈ లీగ్‌లో ముంబై, ఢిల్లీ, బెంగళూరు, గుజరాత్, యూపీ జట్లు పాల్గొంటుండగా.. ఇప్పటికే అన్నీ జట్లు ప్రధాన ప్లేయర్లను రిటైన్ చేసుకోవడంతో పాటు.. అనవసరం అనుకున్న వాళ్లను వదిలేసుకున్నాయి. ఐదు జట్లు కలిపి 60 మంది ప్లేయర్లను అట్టి పెట్టుకోగా.. మిగిలిన వారిని వచ్చే నెలలో జరుగనున్న వేలంలో ఎంపిక చేసుకోనున్నాయి. గుజరాత్ జెయింట్స్ టీమ్ అత్యధికంగా పదకొండు మందిని వేలానికి వదిలేసింది.

అనీశ్‌కు కాంస్యం

దోహా: భారత యువ పిస్టల్ షూటర్ అనీశ్.. ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ విభాగంలో 21 ఏండ్ల అనీశ్ 27 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో 581 పాయింట్లు ఖాతాలో వేసుకున్న అనీశ్ ఏడో స్థానంతో ఫైనల్లో అడుగుపెట్టాడు. ఈ విభాగంలో ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఇటీవల ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడంతో వచ్చే ఏడాది జరగనున్న పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకున్న అనీశ్.. అదే జోరు కొనసాగించాడు. పీటర్ ఫ్లోరిన్ (జర్మనీ), లీ యూహింగ్ (చైనా) వరుసగా స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

ప్రణయ్‌కు తప్పని పరాజయం • చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

షెన్‌జెన్: భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శనతో దుమ్మురేపుతున్నారు. వరుస విజయాలతో అదరగొడుతున్న ఈ జంట చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో శుక్రవారం టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-14తో లియో రాలీ-డానియల్ మార్టిన్ (ఇండోనేషియా) జోడీపై నెగ్గింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ అనవసర తప్పిదాలతో క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలయ్యాడు. కీలక పోరులో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 9-21, 14-21తో కొడాయి నరోకా (జపాన్) చేతలో ఓడాడు. పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో ప్రణయ్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. పదే పదే తప్పులు చేసిన ప్రణయ్ అందుకు తగ్గ మూల్యం చెల్లించుకున్నాడు.

వరుస గేమ్‌ల్లో..

పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత జంట అద్వితీయ ప్రదర్శన కనబర్చింది. 46 నిమిషాల పాటు సాగిన పోరులో వరుస గేమ్‌ల్లో విజృంభించి ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. సందర్భానికి తగ్గట్లు తమ స్థానాలను మార్చుకుంటూ ముందుకు సాగిన సాత్విక్-చిరాగ్.. నెట్ గేమ్‌తో పాటు పవర్‌ఫుల్ షాట్‌లతో ఆకట్టుకున్నారు. ఒక దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన ఇండోనేషియా ప్లేయర్లు తొలి గేమ్‌ను 14-14తో సమం చేసి పోటీలోకి వచ్చారు. ఈ సమయంలో చిరాగ్ చక్కటి షాట్లతో కీలక పాయింట్లు కొల్లగొట్టడంతో గేమ్ మన సొంతమైంది. రెండో గేమ్‌లోనూ ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. మనవాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అదే జోరు కొనసాగిస్తూ.. వరుస గేమ్‌ల్లో పని పూర్తి చేశారు. ఈ ఏడాది ఇండోనేషియా సూపర్-1000, కొరియా సూపర్-500, స్విస్ సూపర్-300 టైటిల్స్ ఖాతాలో వేసుకున్న సాత్విక్-చిరాగ్ జంట.. శనివారం సెమీఫైనల్లో హె జి టింగ్-రెన్ జియాంగ్ (చైనా) జోడీతో తలపడనుంది.

సెమీస్‌లో రష్మిక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరుగుతున్న మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్‌లో రాష్ట్ర యువ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మహిళల క్వార్టర్స్‌లో రష్మిక 6-1, 6-4తో వైష్ణవిపై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కొనసాగించిన రష్మిక.. ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా వరుస సెట్లలో మ్యాచ్‌ను తన వశం చేసుకుంది. మహిళల డబుల్స్‌లో రష్మిక, వైదేహి చౌదరీ ద్వయం 6-0, 0-6, 3-10తో ఇటలీ జోడీ చెరుబిని, స్కిమిత్ చేతిలో ఓడింది.

ముంబైకి హార్దిక్!

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో మరో ఆసక్తికర బదిలీకి రంగం సిద్ధమైంది. గుజరాత్ టైటాన్స్ ప్రస్తుత కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. ముంబై ఇండియన్స్‌కు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారీ మొత్తానికి ఈ బదిలీ జరుగుతున్నట్లు ఐపీఎల్ వర్గాల వినికిడి. దీనిపై అటు గుజరాత్ గానీ, ముంబై ఫ్రాంచైజీ యజమాని నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. ప్లేయర్ల బదిలీలకు ఆఖరి తేదీ అయిన ఈ నెల 26లోగా దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. ముంబై తరపున ఏడు సీజన్లు ఆడిన హార్దిక్..2022లో గుజరాత్‌కు మారాడు. అరంగేట్రం సీజన్‌లోనే గుజరాత్‌ను విజేతగా నిలిపిన సంగతి తెలిసిందే.

ఇమాద్ రిటైర్మెంట్

లాహోర్: పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జాతీయ జట్టు తరపున 121 మ్యాచ్‌లాడిన లెఫ్టార్మ్ స్పిన్నర్ ఇమాద్.. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ తరపున చివరి టీ20 ఆడిన 34 ఏండ్ల ఇమాద్ వన్డేల్లో 44, టీ20ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. ఈ సందర్భంగా తనకు సహకారం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపిన ఇమాద్.. ఇక మీదట లీగ్ క్రికెట్‌లో మాత్రమే ఆడుతానని వెల్లడించాడు.

హైదరాబాద్‌లో 'ఫిఫా' ఫుట్‌బాల్ పిచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మహీంద్ర యూనివర్సిటీలో దేశంలోనే తొలిసారి అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) గుర్తింపు పొందిన పిచ్ అందుబాటులోకి వచ్చింది. స్థానిక క్యాంపస్‌లో శుక్రవారం యూనివర్సిటీ వీసీ ఆనంద్ మహీంద్ర..పిచ్‌ను ప్లేయర్లకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను ఆయన ఆస్వాదించారు. చదువులకు మాత్రమే ప్రాధాన్యమివ్వకుండా మహీంద్ర విశ్వవిద్యాలయం క్రీడలకు పెద్దపీట వేస్తున్నది. ఈ క్రమంలో దేశంలో అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో ఫుట్‌బాల్ పిచ్‌ను రూపొందించింది. ఈ సందర్భంగా ఇటీవల ఆర్చరీ ప్రపంచకప్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన ఆర్యన్‌ను మహీంద్ర అభినందించారు.

మెరిసిన మన షూటర్లు

• జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: న్యూఢిల్లీ కర్ని సింగ్ షూటింగ్ రేంజ్ వేదికగా జరుగుతున్న 66వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మన షూటర్లు పతకాలతో అదరగొట్టారు. శుక్రవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో రెండు స్వర్ణాలు(టీమ్ ఈవెంట్), కాంస్యం (వ్యక్తిగత), రెండు కాంస్యాలు(టీమ్ ఈవెంట్) ఖాతాలో వేసుకున్నారు. పురుషుల జూనియర్ 50మీ రైఫిల్ ప్రోన్‌తో పాటు 50మీ రైఫిల్ ప్రోన్ సివిలియన్‌లో రోహిత్ రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నాడు. అదే జోరు కొనసాగిస్తూ రోహిత్, అబ్దుల్ ఖాలిక్, అద్నాన్ కుష్రోవ్‌తో కూడిన త్రయం 1852.6 స్కోరుతో స్వర్ణం కైవసం చేసుకుంది. 50మీటర్ల రైఫిల్ ప్రోన్ తెలంగాణ కాంస్యం సొంతం చేసుకుంది.

సీనియర్లకు పిలుపు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో ప్రారంభం కానున్న దక్షిణాఫ్రికా పర్యటన కోసం బీసీసీఐ ఇప్పటి నుంచే కసరత్తులు చేస్తున్నది. టూర్‌లో భాగంగా టీమ్‌ఇండియా.. సఫారీ గడ్డపై రెండు టెస్టులు ఆడనున్న నేపథ్యంలో బోర్డు అంతకు ముందే యువ జట్టుతో షాడో టూర్ నిర్వహించనుంది. ఇందులో భాగంగా దక్షిణాఫ్రికా-ఏ జట్టుతో భారత-ఏ జట్టు మూడు అనధికారిక టెస్టులు (నాలుగు రోజుల మ్యాచ్‌లు) ఆడనుంది. దీని కోసం త్వరలోనే జట్టును ఎంపిక చేయనుండగా.. దేశవాళీల్లో నిలకడైన ప్రదర్శన చేస్తున్న యువ ఆటగాళ్లకు చాన్స్ దక్కనుంది. మన ఆటగాళ్లు దక్షిణాఫ్రికా పిచ్‌లపై ఒక అవగాహనకు వచ్చేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని బీసీసీఐ అధికారి తెలిపారు. దీంతో అజింక్యా రహానే, రవిచంద్రన్ అశ్విన్, జైదేవ్ ఉనాద్కట్‌కు భారత-ఏ జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.